
పనిచేయని సోలార్ వేడినీటి యంత్రాలు

గిరిపుత్రులకు భోజనవసతితో పాటు మెరుగైన విద్యను అందించాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన గిరిజన ఆశ్రమపాఠశాలలు సమస్యలకు నిలయాలుగా మారుతున్నాయి. గిరిజన గ్రామాల్లో ఏర్పాటు చేసిన గిరిజన ఆశ్రమ పాఠశాలలపై ఉన్నతాధికారులు నిర్లక్ష్యవైఖరిని అవలంభిస్తుండడంతో పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులు సమస్యలతో సహవాసం చేయాల్సిన పరిస్థితులు ఎదురవుతున్నాయి. బోధనపై శ్రద్ధ తీసుకుంటున్నా సౌకర్యాలు కల్పించడంలో అధికారులు విఫలమవుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.


గిరిజన ఆశ్రమోన్నత పాఠశాల

చలికాలం..

సమస్యలతో సహవాసం

- గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో కనిపించని వసతులు
- దుప్పట్ల పంపిణీ లేదు.. వేడినీటి యంత్రాలు లేవు
- చన్నీటి స్నానాలు.. చెట్లకింద భోజనాలు..
- విద్యార్థులకు తప్పని ఇబ్బందులు

వాంకిడి, జనవరి 5: ఒకవైపు చలి, మరోవైపు వసతుల కొరత మధ్య జిల్లాలోని గిరిజన ఆశ్రమ పాఠశాలల విద్యార్థులు తీవ్రఇబ్బందులు పడుతున్నారు. ఆశ్రమ పాఠశాలలకు ప్రభుత్వం ఏటా లక్షల నిధులు కేటాయిస్తున్నప్పటికీ అధికారుల నిర్లక్ష్యం, పర్యవేక్షణ లోపంతో సౌకర్యాలు ఉండడం లేదు. జిల్లాలో 45గిరిజన ఆశ్రమపాఠశాలలు ఉండగా 12,327మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. జిల్లాలోని అనేక పాఠశాలల్లో మరుగుదొడ్లు, మూత్రశాలలు, డైనింగ్ హాల్ తదితర సమస్యలు వేధిస్తున్నాయి. పాఠశాలల్లో విద్యార్థులకు వేడి నీళ్లు అందించేందుకు ఏర్పాటుచేసిన సోలార్ వేడినీటి యంత్రాలు చెడిపోయి ఏళ్లు కావస్తున్నా అధికారులు మరమ్మతులు చేయించడం లేదు. దీంతో విద్యార్థులు చన్నీళ్లతోనే సరిపెట్టుకోవాల్సి వస్తోంది. ప్రస్తుతం చలికాలం కావటంతో విద్యార్థులకు తిప్పలు తప్పడంలేదు. పాఠశాలల్లో డైనింగ్‌హాల్ లేకపోవడంతో పాఠశాల ఆవరణలోని చెట్ల కింద నీడలో విద్యార్థులు భోజనాలు చేస్తున్నారు. వంటశాలలు లేకపోవడంతో వంట మాస్టర్లు వంటకాలు చేయడానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.


నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్లు

అందని పోషకాహారం..

గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో పాలు, పండ్లు, గుడ్లు, చికెన్‌లను ఐటీడీఏ అధికారులు టెండర్ నిర్వ హించి సరఫరా చేయాల్సి ఉంది. నాలుగు నెలల నుంచి టెండరు తీసుకున్న కాంట్రాక్టర్‌కు బిల్లులు రాకపోవడంతో అతను సరఫరా నునిలిపివేశాడు. ఆయా పాఠశాలల్లో హెచ్‌ఎంలు, వార్డెన్‌లు సరకులను సమకూర్చుకోవాలని అనంతరం బిల్లులు ఇస్తామని అధికారులు చెప్పడంతో నాలుగు నెలల నుంచి హెచ్‌ఎంలు, వార్డెన్‌లు తమ సొంత డబ్బులతో అవసరం ఉన్న సరకులు తీసుకువస్తున్నారు. బిల్లులు లేక సొంత డబ్బులు కట్టలేక తీసుకువచ్చిన సరకులకు సంబంధించిన డబ్బులు అధికమొత్తం కావడంతో కట్టలేని పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం అనేక పాఠశాలల్లో విద్యార్థులకు గుడ్లు, అరిటిపండ్లు అందించడంలేదు.

పంపిణీ కాని దుప్పట్లు

కనిష్ట స్థాయికి పడిపోతున్న ఉష్ణోగతలతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఒక్కో పాఠశాలల్లో 200నుంచి 500లకు పైగా విద్యార్థులు చదువుకుంటున్నారు. వీరిలో కొందరు జ్వరం, జలుబు, చర్మవ్యాధులు, రక్తహీనతతో పాటు అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. చలికాలం ఆరంభంలో పంపిణీ చేసే దుప్పట్లు నేటివరకు ఐటీడీఏ అధికారులు పంపిణీ చేయలేదు. దీంతో విరిగిన తలుపులు, ఊడిన కిటికీలతో ఆశ్రమ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులు చలికి గజగజ వణుకుతూ కాలం వెళ్లదీస్తున్నారు. ఏటా డిసెంబరులో విద్యార్థులకు దుప్పట్లు సరఫరా చేయాల్సిన అధికారులు నేటికీ పంపిణీ చేయలేదు. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో పాటు వసతి గృహాల్లో ఏఎన్‌ఎం పోస్టులు భర్తీ కాకపోవడంతో విద్యార్థులకు సకాలంలో వైద్యచికిత్సలు అందడంలేదు. విద్యార్థులకు రాత్రి, పగలు ఏదైనా అనారోగ్య సమస్య వస్తే ఆశ్రమపాఠశాలల్లో ప్రథమ చికిత్సలు చేయడానికి ఏఎన్‌ఎంలు లేక ప్రభుత్వవైద్యశాలకు వెళ్లక తప్పడం లేదు.

సమస్యలపై ఉన్నతాధికారులకు నివేదిక అందించాం.. : చంద్రమౌళి, హెచ్‌ఎం



గిరిజన ఆశ్రమోన్నత పాఠశాల, బంబార పాఠశాలల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఉన్నతాధికారులకు నివేదికలు పంపించాం. సోలార్ వేడినీటి యంత్రం, మరుగుదొడ్లు పనిచే యడం లేదు. నాలుగునెలల నుంచి విద్యార్థులకు పోషకాహారం అందడం లేదు. పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను ఉన్నతాధికారులకు నివేదికలు పంపించాం.

ప్రజాపాలన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

- కలెక్టర్ హేమంత్ బోర్కడే


మాట్లాడుతున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే

ఆసిఫాబాద్, జనవరి 5: ప్రజాపాలనలో భాగంగా వచ్చిన ప్రతి దరఖాస్తును పరిశీలించి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో అదనపుకలెక్టర్ దీపక్ తివారితో కలిసి డాటా ఎంట్రీఆపరేటర్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగాకలెక్టర్ మాట్లాడుతూ డిసెంబరు 28నుంచి ఈ నెల 6వరకు కొనసాగుతున్న ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులను డాటాఎంట్రీ ఆపరేటర్లు పరిశీలించి దరఖాస్తులో ఉన్న పూర్తిసమాచారాన్ని ఖచ్చితంగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. నమోదు చేసిన సమయంలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. దరఖాస్తుదారుల ఆధార్ కార్డు, రేషన్ కార్డు, మొబైల్ నెంబర్లతో పాటు దరఖాస్తుదారుడు నింపిన సమాచారాన్ని మాత్రమే అప్‌లోడ్ చేయాలని తెలిపారు. దరఖాస్తు వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు పూర్తైన తరువాత సంబంధిత దరఖాస్తుదారుడి ఫోన్‌కు సందేశం వెళ్తుందన్నారు. ఈ నెల 6నుంచి 17వతేదీలోగా ఆన్‌లైన్‌లో నమోదుప్రక్రియ పూర్తిచేయాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లాపంచాయతీ అధికారి ఉమర్‌హుస్సేన్, ఎంపీడీవోలు, కార్యదర్శులు, డాటాఎంట్రీ ఆపరేటర్లు పాల్గొన్నారు.

కొలాం గ్రామాలను సందర్శించిన అడిషనల్ డైరెక్టర్


గ్రామాలను సందర్శిస్తున్న అడిషనల్ డైరెక్టర్ అమర్‌సింగ్ నాయక్

కెరమెరి, జనవరి 5: మండలంలోని కొలాం గూడలో కొన్ని రోజులుగా నిర్వహిస్తున్న రక్తనమునాల సేకరణ కార్యక్రమాన్ని శుక్రవారం రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ అడిషనల్ డైరెక్టర్ అమర్‌సింగ్ నాయక్ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొలాం గిరిజనులు రక్తహీనత కారణంగా వివిధరకాల వ్యాధులకు గురవుతున్నారని అన్నారు. వారి రక్తనమునాలను సేకరించి వ్యాధులను నివారించనున్నట్లు తెలిపారు. శుక్రవారం ఆయన కొలాంకోటారి, కొలాంఝరి గ్రామాలను సందర్శించారు. ఆయనవెంట డీఎంహెచ్‌వో డాక్టర్ తుకారాంభట్, డిప్యూటీ డీఎంహెచ్‌వో సుధాకర్ నాయక్, వైద్యాధికారి వినోద్‌కుమార్, ఫార్మసిస్ట్ ఖలీల్ షైమద్ ఉన్నారు.

పెండింగ్ వేతనాలను చెల్లించాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

ఆసిఫాబాద్, జనవవరి 5: పెండింగ్ వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ఆ సంఘం నాయకులు మాట్లాడుతూ ఎస్సీ, బీసీహాస్టళ్లలో పని చేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికుల పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. జిల్లాలోని ఎస్సీ హాస్టల్స్‌లో 7, బీసీ హాస్టల్స్‌లో 11నెలల వేతనాలు పెండింగ్ ఉన్నాయన్నారు. అలాగే ఈఎస్‌ఐ, పీఎఫ్, హెల్త్‌కార్డు, గుర్తింపు కార్డులు వెంటనే మంజూరు చేయాలని డిమాండ్‌చేశారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, తిరుపతి, సత్యశ్రీ, లత, కవిత, కొమురయ్య, లక్ష్మి, శారద, రమాదేవి, రేవతి, కవిత, రాణి, రమ్య పాల్గొన్నారు.

ప్రజాపాలన కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలి

ఆసిఫాబాద్ రూరల్, జనవరి 5: ప్రజాపా లన దరఖాస్తుల కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలని ఎంపీపీ మల్లికార్జున్ అన్నారు. శుక్రవారం మండలంలోని రౌటసంకెపల్లి, రహపల్లి గ్రామాల్లో చేపట్టాలని ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి అర్హులైన అందరికి ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ మంగ, డీసీసీ అధ్యక్షుడు కె విశ్వప్రసాద్, సర్పంచ్‌లు శ్రీనివాస్, కిష్టయ్య, ఎంపీడీవో శశికళ పాల్గొన్నారు.

రోడ్డు సౌకర్యం కల్పించాలి


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎంపీపీ విమలాబాయి

వాంకిడి, జనవరి 5: మండలంలోని చౌపన్‌గూడ, నవేగూడ, సవ్వాతి గ్రామ పంచాయతీలోని నవేగాం, టోక్కిగూడ, ఉర్వేతగూడ, గోందాపూర్, ఎల్లానగర్ గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించాలని శుక్రవారం ఎంపీపీ విమలాబాయి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కొంతకాలంగా ఈ గ్రామాలకు రోడ్డు సౌకర్యం లేక ఆయా గ్రామాల ప్రజలు తీవ్రఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. గ్రామాలకు వెంటనే రోడ్డు సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో భీం పటేల్, దీపక్ పాల్గొన్నారు.

జాతీయ జట్టుకు కెప్టెన్‌గా గోలేటి క్రీడాకారిణి


ఆత్రం స్వప్న

రెబ్బెన, జనవరి 5 జాతీయ స్థాయి బాల్‌బ్యాడ్మింటన్ మహిళా జట్టుకు కెప్టెన్‌గా గోలేటి క్రీడాకారిణి ఆత్రం స్వప్న ఎంపికైనట్టు ఆదిలాబాద్ జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రధానకార్యదర్శి ఆర్ నారాయణ రెడ్డి తెలిపారు. అలాగేజాతీయ స్థాయి బాల్‌బ్యాడ్మింటన్ మహిళా జట్టులో విష్ణుప్రియ ఎంపికైనట్టు వివరించారు. ఈనెల 10వరకు మహారాష్ట్రలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో వీరు ఆడుతారన్నారు. ఎంపికైనవారిని ఆదిలాబాద్ బాల్‌బ్యాడ్మింటన్‌సంఘం నాయకులు అభినందించారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

వాంకిడి, జనవరి 5: మండలంలోని బంబార గ్రామశివారు ప్రాంతంలో పేకాట ఆడుతున్న పలువురిని పట్టుకున్నట్లు ఎస్సైసాగర్ తెలిపారు. ఆయన తెలిపినవివరాల ప్రకారం.. గురువారంరాత్రి బంబార గ్రామశివారులో పేకాట ఆడుతున్నట్లు అందిన పక్కాసమాచారం మేరకు దాడులు నిర్వహించామన్నారు. ఈదాడుల్లో పేకాట ఆడుతున్న అయిదుగురిని అదుపులోకి తీసుకున్నామని తెలి పారు. వారివద్దనుంచి రూ.2250నగదు స్వాధీన పర్చుకుని ఐదుగురిపై కేసునమోదు చేసినట్లు తెలిపారు.

జడ్పీటీసీ ఇంటికి నిప్పంటించిన దుండగులు

బెజ్జూరు, జనవరి 5: బెజ్జూరు జడ్పీటీసీ పంద్రం పుష్పలత కొత్తగా నిర్మించిన ఇంటికిగుర్తు తెలియని వ్యక్తులు గురువారం రాత్రి నిప్పంటించారు. ఆమె తెలిపిన వివరాలప్రకారం.. మండలంలోని సోమిని లో ఇటీవల నిర్మించిన ఇంటికి గుర్తుతెలియని వ్యక్తులు నిప్పంటించారు. మంటలు చెలరేగడంతో సమీపప్రజలు సమాచారం అందించడంతో హుటాహుటిన వచ్చి మంటలు ఆర్పారు. ఇంట్లోనిపత్తికి నిప్పు అంటుకోవడంతో మంటలు చెలరేగి తలుపులు పాక్షికంగా దగ్ధమయ్యాయి. ప్రమాదంలో రెండు క్వంటాళ్ల పత్తిదగ్ధమైంది. రూ.20వేలఆస్తినష్టం సంభవించినట్లు జడ్పీటీసీ తెలిపారు.

ఆశ్రమ పాఠశాలను సందర్శించిన ప్యానల్ టీం

బెజ్జూరు, జనవరి 5: బెజ్జూరు మండలం సోమిని ఆశ్రమ పాఠశాలను శుక్రవారం కాగజ్‌నగర్ డివిజన్ ప్యానల్‌టీం సందర్శించింది. ఈసందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు బోధిస్తున్న తీరుపై అడిగి తెలుసుకున్నారు. పాఠశాలపరిసరాలను పరిశీలించి విద్యార్థులకు నాణ్యమైన విద్యను బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రభుత్వ నిర్దేశించిన ప్రకారం విద్యార్థుకలు మెనూ అందించాలన్నారు. అదే విద్యార్థులకు ప్రతినెల సరుకులు సరఫరా అవుతున్నాయా అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్యానల్ టీం ఉపాధ్యాయులు శ్రీనివాస్, మధుసూదన్, ప్రసాద్, ధర్మన్న తదితరులు ఉన్నారు.

పరీక్ష ఫీజు సకాలంలో చెల్లించాలి

కాగజ్‌నగర్ టౌన్, జనవరి 5: డాక్టర్ అంబేద్కర్ ఓపెన్‌యూనివర్సిటీ సెమిస్టర్-3, సెమిస్టర్-5 పరీక్షలఫీజును సకాలంలో చెల్లించాలని ఎస్‌కేఈ డిగ్రీకళాశాల ఓపెన్ యూనివర్సిటీ సెంటర్ కోఆర్డినేటర్ దత్తాత్రేయ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు అపరాధ రుసుము లేకుండా ఈనెల17లోగా చెల్లించుకోవాలన్నారు. ప్రతీసబ్జెక్టుకు రూ.150, అలాగేసైన్స్ విద్యార్థులకు ప్రాక్టికల్స్‌ఫీజు ఆదనంగా రూ.150 చెల్లించాల్సి ఉంటుందన్నారు. సెమిస్టర్-3 పరీక్షలు ఫిబ్రవరి16నుంచి22వరకు, సెమిస్టర్-5పరీక్షలు ఫిబ్రవరి 26నుంచి మార్చి2 వరకు ఉంటాయన్నారు.వివరాలకు 9866398678, 9494314314, 7382929651 నంబర్లలో సంప్రదించాలన్నారు.

ముగ్గురు మృతికి కారణమైన వ్యక్తికి పదేళ్ల జైలు

ఆసిఫాబాద్ రూరల్, జనవరి 5: కాగజ్‌నగర్ మండలపరిధిలో 2021లో మద్యంమత్తులో వాహనాన్ని అజాగ్రత్తగా నడుపుతూ ముగ్గురి మరణానికి కారణమైన కేసులో నిందితుడికి 10సంవత్సరాల కఠిన కారాగారశిక్ష, రూ.25,500 జరిమానా విధిస్తూ ఆసిఫాబాద్ జిల్లా సెషన్స్ కోర్టు జడ్జి ఎంపీ రమేష్ శుక్రవారం తీర్పుచెప్పారు. లైజనింగ్ ఆఫీసర్ సాగర్, సబ్‌డివిజనల్ లైసనింగ్ ఆఫీసర్ కాగజ్‌నగర్ బాబాజీ తెలిపినవివరాల ప్రకారం.. పుల్ల కృష్ణ(28) అనేవ్యక్తి జిల్లాలోని కాగజ్‌నగర్‌టౌన్ పోలీసుస్టేషన్ పరిధిలో 2020ఫిబ్రవరి 25నపట్టణంలో మద్యంమ్మతులో వాహనాన్ని అజాగ్రత్తగా నడుపుతూ ఎదురుగా వచ్చిన ఆటోలో ఉన్న ముగ్గురు వ్యక్తుల మరణానికి కారణమయ్యాడు. ఈ ఘటనపై ఈసుగాంకు చెందిన మనోజ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. అనంతరం ప్రాసిక్యూషన్ తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ జగన్‌మోహన్‌రావు ప్రవేశపెట్టిన సాక్షుల విచారణ అనంతరం కేసు పూర్వపరాలను పరిశీలించి నిందితుడు కృష్ణకు పది సంవత్సరాల కఠినకారాగారశిక్ష, రూ.25,500 జరిమానా విధించారు. కేసులో నిందితుడికి శిక్ష పడేలా చేసిన పోలీసు అధికారులను, సిబ్బందిని ఎస్పీ సురేష్‌కుమార్ అభినందించారు.

ప్రజాపాలన ఆన్‌లైన్ ప్రక్రియ ప్రారంభం

కాగజ్‌నగర్ టౌన్, జనవరి 5: తెలంగాణ ప్రభుత్వం ప్రారంభించిన 6గ్యారంటీ పథకాల్లో భాగంగా దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ ఆన్‌లైన్ ప్రక్రియ ప్రారంభించాలని ప్రభుత్వం ఆదేశాలిచ్చిందన్నారు. ఇందులో భాగంగా 30వార్డులకు 60మంది ఆపరేటర్లు, సిబ్బందితో పాటు ప్రతి దరఖాస్తును ఆన్‌లైన్‌లో నమోదు చేస్తామన్నారు. ఈనెల 6వరకు దరఖాస్తులు స్వీకరణకు ఆఖరుతేదీ ఉండగా శుక్రవారం వరకు పట్టణంలోని అన్ని వార్డుల్లో నుంచి 14,047దరఖాస్తులు వచ్చినట్లు మున్సిపల్ కమిషనర్ తెలిపారు. ఈ ప్రక్రియలో మున్సిపల్ కమిషనర్ అంజయ్యతో పాటు డీఈఈ రమాదేవి, అధికారులు బాపు, పెద్దింటి క్రాంతి, మోతీరాం ప్రత్యేకాధికారులుగా వ్యవహరించనున్నారు.

విద్యార్థులకు దుప్పట్ల పంపిణీ

కాగజ్‌నగర్, జనవరి 5: కాగజ్‌నగర్ ఏకలవ్య మోడల్ స్కూల్‌లో 124మందివిద్యార్థులకు పట్టణసీఐ బుద్దెస్వామి, సీసీఎస్ సీఐ ముత్యాలరాజు శుక్రవారం దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్టు వివరించారు. కార్యక్రమంలో వివేకానంద యూత్ సభ్యులు, కానిస్టేబుల్ కిరణ్, తిరుపతి, మహేందర్, శ్యాం సుందర్, వెంకటేష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇథనాల్ ఫ్యాక్టరీ అనుమతులు రద్దు చేయాలి

బెజ్జూరు, జనవరి 5: నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్, గుండంపల్లి గ్రామాల్లో నిర్మి స్తున్న ఇథనాల్ ఫ్యాక్టరీ అను మతులు రద్దు చేయాలని అంబేద్కర్‌సంఘం జిల్లా అధ్య క్షుడు సతీష్ డిమాండ్ చేశా రు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ ఆరునెలలుగా ఉద్యమిస్తున్న రైతులపై లాఠీచార్జిచేసి నాన్‌బెయిలబుల్ కేసులుబనాయించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సాయి, రాంచందర్, ఈశ్వర్, ప్రవీణ్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

కెరమెరి, జనవవరి 5: మండలంలోని ఖైరి గ్రామంలో వారం రోజులక్రితం విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో మోర్లె చంద్రయ్య ఇల్లు దగ్ధంకాగా ప్రభుత్వ కళాశాల అధ్యాప కులు అయిదు వేల ఆర్థికసాయం అందజేశారు. చంద్ర య్య కుమార్తె స్వాతి కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతుండగా విషయం తెలుసుకున్న అధ్యాపకులు బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సాయం, నిత్యావసర సరుకులు అందజేశారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

కౌటాల, జనవరి 5: మండలంలోని తాటిపల్లి గ్రామంలో శుక్రవారం తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఆధ్వర్యంలో ప్రజలకు ఆర్థికఅక్షరాస్యతపై మేనేజర్ నర్సింహస్వామి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ సామాజికభద్రత పథకాలైన ప్రధానమంత్రి సురక్ష బీమాయోజన, ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన, ఎస్బీఐ జనరల్ ఇన్సురెన్స్, అటల్‌పెన్షన్ యోజన, పీఎం జెడీవై, తదితర పథకాలపై అవగాహన కల్పించారు. అలాగే మొబైల్ బ్యాంకింగ్, రూపేకార్డు, యూపీఐ, ఆధార్ అనుసంధానం, డిజిటల్‌లావాదేవీలపై అవగాహన కల్పిం చారు. కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది, గ్రామస్థులు రాజేష్, సురేష్, మోరేశ్వర్, ఆనంద్ రావు, బయ్యాజీ, కుషబ్ రావు, కిశోర్, షకీర, కాశీనాథ్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి డిస్కస్‌త్రో లో జైనూర్ విద్యార్థుల ప్రతిభ

జైనూర్, జనవరి 5: గిరిజనసంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి డిస్కస్‌త్రోలో స్థానిక బాలికల ఆశ్రమోన్నతపాఠశాల విద్యార్థినులు ప్రతిభ కనబర్చారు. ఈ సందర్భంగా జూనియర్ డిస్కస్‌త్రోలో మడావి అనిత 7వతరగతి, సీనియర్ డిస్కస్ త్రో లో కరమనకర్ మనీషా 9వతరగతి రాష్ట్రస్థాయిలో ద్వితీయ బహుమతులను కైవ సం చేసుకున్నారని ఆ పాఠశాల హెచ్‌ఎం మండాడి సోనే రావ్ తెలిపారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లా డుతూ తమ పాఠశాల విద్యార్థినులు రాష్ట్ర స్థాయి డిస్కస్ త్రోలో సీనియర్ జూనియర్ విభాగంలో రెండవ బహుమతులు కైవసం చేసుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమలో వార్డెన్ గజానంద్, ఉపాధ్యాయులు పాల్గోన్నారు.

నర్సరీ కార్మికుల వేతనాలు చెల్లించాలి

రెబ్బెన, జనవరి 5: రెబ్బెన నర్సీరలో పనిచేస్తున్న కార్మికులు వెంటనే వేతనాలు చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధానకార్యదర్శి బోగే ఉపేందర్ తెలిపారు. శుక్రవారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నర్సరీ కార్మికులకు పెండింగ్ వేతనాలు రావాల్సి ఉందన్నారు. వెంటనే చెల్లించేట్టు చూడాలన్నారు. లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడుతామన్నారు. ఈ నెల 10న జీఎం కార్యాలయం ముట్టడి చేస్తామన్నారు. సమావేశంలో కార్మికులు పాల్గొన్నారు.



ఉత్పత్తి లక్ష్యాన్ని సమష్టిగా సాధిద్దాం: సీఎండీ

శ్రీరాంపూర్, జనవరి 5: బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని సమిష్టిగా సాధిద్దామని సీఎండీ ఎన్ బలరాం అన్నారు. శుక్రవారం ఆయన శ్రీరాం పూర్ ఏరియా జీఎం బి సంజీవరెడ్డితో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 70మిలియన్ టన్నుల బొగ్గును వెలికితీయాల్సి ఉందన్నారు. ఇప్పటికే తొమ్మిది నెలలు గడిచిపోయాయని, ఇక రానున్న మూడు నెలలు చాలా ప్రధానమన్నారు. ప్రతి రోజు 2.24 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి, 15 లక్షల క్యూబిక్‌మీటర్ల ఓవర్ బర్డెన్‌ను తొలగిం చాలన్నారు. ఇప్పటివరకు 49.66 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి, 51 మిలియన్ టన్నుల బొగ్గు రవాణా చేశామని, 306.6 మిలియన్ క్యూబిక్ మీటర్ల ఓబీ తొలగించామని తెలిపారు. నూతన ప్రాజెక్టులు ప్రారంభించేందుకు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలతో మాట్లాడి భూసేకరణ, అనుమతులను తక్షణమే తెప్పించుకోవాలన్నారు. సింగరేణిలో సృజనాత్మకత కలిగిన వారిని గుర్తిస్తామని, పని సంస్కృతిని పోత్సహిస్తామని తెలిపారు. సమావేశంలో బెల్లంపల్లి రీజియన్ జీఎం(రక్షణ) కెహరినారాయణ గుప్తా, ఎస్‌వోటుజీఎం కె రఘుకుమార్, పీవోలు ఎం శ్రీనివాస్, విపురుషోత్తమ రెడ్డితదితరులు పాల్గొన్నారు.

సీఎండీని కలిసిన ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు

మందమర్రిటౌన్, జనవరి 5: సింగరేణి సీఎండీ బలరాంను శుక్రవారం సింగరేణి ఎస్సీఎస్టీవెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. పూలబొకే అందజేసి శాలువాతో సత్కరించారు. సింగరేణిలో ఎస్టీ కార్మికులకు సంబంధించిన రిజర్వేషన్ పాలసీని ఎలాంటిలోటు పాట్లు లేకుండా చూడాలన్నారు. సంస్థ అభి వృద్ధికి, కార్మికసంక్షేమానికి తమ వంతు చేయూతనందిస్తామన్నారు. కార్య క్రమంలో నాయకులు శివ, రవికుమార్, బుక్య వీరన్న, సురేష్, నాగేశ్వర్ రావు, వెంకన్న, పి కృష్ణ ప్రసాద్, బి బాసు, జె రవి, శ్రీనివాస్, సభ్యులు పాల్గొన్నారు.

నర్సరీ కార్మికులకు జీవో ప్రకారం వేతనాలివ్వాలి

శ్రీరాంపూర్, జనవరి 5: సింగరేణిలో పనిచేసే నర్సరీ కార్మికులకు అగ్రికల్చర్ జీవో ప్రకారం వేతనాలివ్వాలని సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘం(ఎస్‌సీకేఎస్-సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షుడు దూలం శ్రీనివాస్ అన్నారు. శ్రీరాంపూర్‌లోని సీఐటీయూ కార్యాలయంలో డివిజన్ అధ్యక్షురాలు వేల్పుల కుమారి అధ్యక్షతన నర్సరీ కార్మికుల సమావేశం నిర్వహించారు. 2022 సెప్టెంబర్‌లో జరిగిన సమ్మె సందర్భంగా నర్సరీలలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు అగ్రికల్చర్ జీవో ప్రకారం వేతనాలు ఇచ్చేందుకు కార్మిక శాఖ అధికారి సమక్షంలో సింగరేణి యాజమాన్యంతో ఒప్పందం కుదిరిందన్నారు. కానీ ఇంతవరకు దానిని అమలు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. జీవో ప్రకారం వేతనాలు, బోనస్ చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో శ్రీరాంపూర్ నర్సరీ అధ్యక్ష, కార్యదర్శులు కట్ల కళ, మోతె సరోజన, మందమర్రి నర్సరీ అధ్యక్ష, కార్యదర్శులు విజయలక్ష్మి, అత్తె కళావతి, గోలేటి నర్సరీ కార్యదర్శి శారద, కార్మికులు పాల్గొన్నారు.

హై పవర్ కమిటీ వేతనాలు ఇప్పించండి

శ్రీరాంపూర్, జనవరి 5: కాంట్రాక్టు కార్మికులకు హై పవర్‌కమిటీ వేతనాలు ఇప్పించాలని సింగరేణి కాలరీస్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్ టీయూ) రాష్ట్రఅధ్యక్షుడు బ్రహ్మానందం, రాష్ట్ర కార్యదర్శి ఎం వెంకన్న కోరారు. శుక్రవారం వారు సింగరేణి సీఎండీ ఎన్ బలరామ్‌ను హైదరాబాద్‌లో కలిసి వినతిపత్రం అందించారు. కొన్నేళ్లుగా కాంట్రాక్టు కార్మికుల వేతనాలు పెరగకపోవడంతో చాలా ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. తమ యూనియన్ చొరవతో 20ఏళ్ల క్రితం రోడ్స్‌అండ్‌బిల్డింగ్స్ జీవోలు అమలయ్యాయన్నారు. 11వ వేజ్‌బోర్డులో హైపవర్ వేతనాల గురించి ఒప్పందం జరిగిందని, ఇతరచోట్ల అమలు చేస్తుండగా, సింగరేణిలో పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాంట్రాక్టు కార్మికులకు సెలవులు ఇవ్వాలని, చనిపోయిన కార్మికుడి కుటుంబానికి పరిహారం ఇవ్వాలని, వైద్య సౌకర్యం కల్పించాలని సీఎండీకి విన్న వించారు. ఆయన సానుకూలంగా స్పందించినట్లు బ్రహ్మానందం, వెంకన్న తెలిపారు.

కార్మికులకు హెచ్‌ఆర్‌ఏ చెల్లించాలి

మందమర్రి టౌన్: ఇంటిఅద్దె చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని సీఎండీ బలరాంకు మందమర్రి బ్రాంచి కార్యదర్శి సలేంద్రసత్యనారాయణ వినతిపత్రం సమర్పించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సీఎండీ కార్యాలయంలో ఆయనను కలిసి హెచ్‌ఆర్‌ఏ చెల్లించకపోవడంవల్ల కార్మికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించారు.

ఎక్స్‌రే మిషన్‌ను డిస్పెన్సరీ నుంచి తరలించొద్దు

శ్రీరాంపూర్, జనవరి 5: నస్పూర్ డిస్పెన్సరీ నుంచి ఎక్స్‌రే మిషన్‌ను వేరే చోటికి తరలించవద్దని ఐఎన్‌టీయూసీ ఏరియా ఉపాధ్యక్షుడు జె శంకర్‌రావు అన్నారు. ఎక్స్‌రే మిషన్‌ను తరలిస్తున్నారన్న సమాచారం మేరకు ఆయన శుక్రవారం డిస్పెన్సరీని సందర్శించి వైద్యులతో మాట్లాడారు. తక్షణమే తరలింపు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కేంద్రఉపాధ్యక్షుడు కలవేన శ్యామ్, కేంద్ర ఉప కార్యదర్శి గరిగె స్వామి, తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు వైద్యపరీక్షలు

బెల్లంపల్లి, జనవరి 5: పట్టణంలోని శాంతిఖని గని ఉద్యోగులకు గనిలో ఆర్కేపీఏరియా ఆసుపత్రి వైద్యులు శుక్రవారం వైద్యపరీక్షలు నిర్వహించారు. అనారోగ్యంగా ఉన్నవారిని బెల్లంపల్లి సింగరేణి ఏరియా ఆసుపత్రికి రెఫర్‌చేశారు.

బెల్లంపల్లి ఎమ్మెల్యేను కలిసిన జీఎం

మందమర్రి టౌన్, జనవరి 5: బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డంవినోద్‌ను శుక్రవారం మందమర్రి ఏరియా జీఎం మనోహర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మందమర్రి, బెల్లంపల్లి ఏరియాల ఉత్పత్తి వివరాలను ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. కార్మిక సంక్షేమానికి పెద్దపీట వేయాలని ఆయన కోరారు.

కార్మికుల సమస్యలు తెలుసుకున్న నాయకులు

శ్రీరాంపూర్, జనవరి 5: శ్రీరాంపూర్ సీహెచ్‌పీలో కార్మికులు ఎదుర్కొంటున్నసమస్యలను ఏఐటీయూసీ ఉపప్రధానకార్యదర్శి ముష్కె సమ్మయ్య, శ్రీరాంపూర్ బ్రాంచ్‌కార్యదర్శి ఎస్‌కేబాజీసైదా శుక్రవారం తెలుసుకున్నారు. సీహెచ్‌పీలో కార్మికులను కలిసి యాజమాన్యంతో చర్చించి పరిష్కారానికి కృషిచేస్తామన్నారు.

సర్వేను అడ్డుకున్న రైతులు



సర్వేను అడ్డుకున్న ముల్కల గ్రామస్తులు

హాజీపూర్, జనవరి 5 : ఎన్‌హెచ్ 63 గ్రీన్‌ఫీల్డ్ హైవే సర్వేను శుక్రవారం ముల్కల గ్రామానికి చెందిన రైతులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ రకరకాల సర్వేలు చేస్తూ ఇబ్బందులు పెడుతున్నారని, తమ భూముల నుంచి రహదారి వెళ్తుండడంతో భూములను కోల్పోవాల్సి వస్తుందన్నారు. తమకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా సర్వే చేస్తున్నారని మండిపడ్డారు. గ్రీన్‌ఫీల్డ్ హైవేను పొలాల మీదుగా కాకుండా జాతీయ రహదారి వెంబడి విస్తరణ చేయాలని కోరారు. తమకు ముందుగా సమాచారం ఇచ్చి తమతో చర్చలు జరిపి సర్వే చేయాలన్నారు. సర్వే అధికారులు వెళ్లిపోయారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

దండేపల్లి, జనవరి 5: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను అర్హులైన ప్రజలందరికి అందజేస్తామని ఆర్డీవో రాములు అన్నారు. పెద్దపేట, నెల్కి వెంకటాపూర్‌లో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమాన్ని శుక్రవారం పరిశీలించారు. ప్రజాపాలనలో ప్రజలకు ఇబ్బందులు లేకుండా దరఖాస్తులను స్వీకరించాలని అధికారులకు సూచించారు. గ్రామసభలో దరఖాస్తును అధికారులకు అందజేసి రసీదు పొందాలన్నారు. అనంతరం ద్వారక, తానిమడుగులో దరఖాస్తులు స్వీకరించారు. ఎంపీపీ గడ్డం శ్రీనివాస్, జడ్పీటీసీ నాగరాణి, తహసీల్దార్ సంధ్యరాణి, ఎంపీడీవో మల్లేషం, డిప్యూటీ తహసీల్దార్ విజయ, ఆర్ఐలు భూమన్న, చంద్రమౌళి, సర్పంచులు మాధవి, గీత, ప్రేమల, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

జన్నారం: కిష్టాపూర్, కామన్‌పల్లి, ధర్మారం, కవ్వాల్ గ్రామాల్లో ప్రజాపాలన గ్రామసభల్లో ప్రజలు దరఖాస్తులు చేసుకున్నారు. సర్పంచులు శ్రీనివాస్, గంగాధర్, లక్ష్మీబాయి, తార ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

రామకృష్ణాపూర్: ప్రజా పాలనలో భాగంగా 5వ వార్డు అమరవాది సెంటర్ వద్ద కౌన్సిలర్ జిలుకర మహేష్, వార్డు అధికారి నవీన్, ఆర్‌పి రాజేశ్వరి, ఆశా వర్కర్ గౌరమ్మ దరఖాస్తులు స్వీకరించారు.

ముగిసిన ప్రజాపాలన సభలు

కాసిపేట: వారం రోజులపాటు జరిగిన ప్రజాపాలన సభలు శుక్రవారం ముగిశాయి. ఎంపీడీవో ఆలీం మాట్లాడుతూ గత నెల 28 నుంచి ప్రారంభమైన ప్రజాపాలనలో 7979 దరఖాస్తులు రాగా రేషన్‌కార్డుల కోసం 1991 దరఖాస్తులు



లబ్ధిదారుల నంచి దరఖాస్తున్న స్వీకరిస్తున్న ఆర్డీవో, ఎంపీపీ

వచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆన్‌లైన్ నమోదు ప్రారంభం

భీమారం: ప్రజాపాలన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేసే కార్యక్రమాన్ని ఎంపీడీవో, తహసీల్దార్, సెర్ప్ కార్యాలయాల్లో ఎంపీడీవో శ్రీనివాస్ ప్రారంభించారు. తహసీల్దార్ విశ్వంభర్, సెర్ప్ ఏపీఎం త్రయంబకేశ్వర్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఎదుట ఆదివాసీల నిరసన



ఎమ్మెల్యే వాహనం ఎదుట ఆదివాసీ సంఘాల నాయకులు

కాసిపేట, జనవరి 5: దేవాపూర్ ఓరియంట్ సిమెంట్ కంపెనీలో శుక్రవారం గేట్ మీటింగ్‌కు హాజరైన ఎమ్మెల్యే గడ్డం వినోద్‌ను ఆదివాసీ సంఘాలు అడ్డుకుని నిరసన తెలిపాయి. గతంలో ఓరియంట్ సిమెంట్ కంపెనీ గుర్తింపు సంఘం అధ్యక్షుడిగా ఉన్న రాములునాయక్ వల్ల ఆదివాసీలకు అన్యాయం జరిగిందని పేర్కొన్నారు. రాములునాయక్‌కు మద్దతుగా ఎమ్మెల్యే వస్తుండగా అడ్డుకుని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొద్ది సేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు మడావి వెంకటేష్ మాట్లాడుతూ గతంలో గుర్తింపు సంఘం అధ్యక్షుడిగా పనిచేసిన రాములు నాయక్ స్థానిక ఆదివాసీలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంలో విఫలమయ్యారని తెలిపారు. రాములునాయక్‌కు ఎమ్మెల్యే మద్దతు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎమ్మెల్యేకు అందించారు. స్థానిక ఆదివాసీ నాయకులు పాల్గొన్నారు.

మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా



కల్యాణలక్ష్మి చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే

వేమనపల్లి, జనవరి 5: వెనుకబడిన వేమనపల్లి మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే గడ్డం వినోద్ హామీ ఇచ్చారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో పలువురు లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలో అనేక సమస్యలు ఉన్నాయని, వాటిని దశల వారీగా పరిష్కరిస్తానని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభు త్వం అన్ని వర్గాల సంక్షేమానికి గ్యారంటీ పథకాలను తీసుకువచ్చిందని, వీటిని సమర్థవంతంగా అమలు చేస్తామన్నారు. ఎంపీపీ కోలి స్వర్ణ లత, జెడ్పీటీసీ స్వర్ణలత, తహసీల్దార్ సదానందం, ఎంపీడీవో లక్ష్మ య్య, పీఏసీఎస్ ఛైర్మన్ కుబిడె వెంకటేశం, సర్పంచులు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే దస్నాపూర్, నీల్వాయి గ్రామాల్లో పర్యటించారు.

బెల్లంపల్లి: ఎమ్మెల్యే గడ్డం వినోద్‌ను బెల్లంపల్లి సాయిబాబా ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు. కమిటీ సభ్యులు షిర్డీలో జరిగిన పల్లకి సేవలో పాల్గొని తీసు కువచ్చిన తీర్థ ప్రసాదాలను ఎమ్మెల్యేకు అం దించారు. ఆలయ ఛైర్మన్ ఆవునూరి దుర్గయ్య, సభ్యులు దత్తు, చరణ్ పాల్గొన్నారు.

చెన్నూరు: పట్టణంలోని మధున పోచ మ్మ ఆలయంలో ఎమ్మెల్యే వినోద్ వెంకట స్వామి కుటుంబీకులతో కలిసి పూజలు నిర్వహించారు. అధికారులు స్వాగతం పలికారు.

ప్రతీ దరఖాస్తును ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

మంచిర్యాల కలెక్టరేట్, జనవరి 5: ప్రజాపాలన కార్యక్రమం ద్వారా ఐదు గ్యారంటీ పథకాలకు ప్రజలు చేసుకున్న దరఖాస్తుల వివరాలను నిర్ణీత గడువులోగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కలెక్టర్ బదావత్ సంతోష్ పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ రాహుల్, డీఆర్‌డీవో శేషాద్రి, డీపీవో వెంకటేశ్వర్‌రావు, జెడ్పీ సీఈవో నరేందర్‌తో కలిసి తహసీల్దార్‌లు, మున్సిపల్ అధికారులు, ఎంపీడీవోలు, డాటా ఎంట్రీ ఆపరేటర్లతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ వార్డుల దరఖాస్తు సంఖ్య నమోదు చేసిన అనంతరం కులం, పుట్టిన తేదీ, ఆధార్, రేషన్ కార్డు, మొబైల్ నెంబర్లు, కుటుంబ సభ్యుల వివరాలు, చిరునామా ఆన్‌లైన్‌లో తప్పులు లేకుండా నమోదు చేయాలన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ బదావత్ సంతోష్

ఆన్‌లైన్‌లో నమోదు చేసిన అనంతరం నంబరును దరఖాస్తు ఫారంపై రాయాలన్నారు. ఈనెల17లోగా నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు.

ప్రచార వ్యయాల ముసాయిదా ధరల పట్టిక

వచ్చేపార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా అభ్యర్థులు చేసే ప్రచారసంబంధిత వ్యయాల ముసాయిదా ధరల పట్టిక రూపొందించామని కలెక్టర్ బదావత్ సంతోష్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో ఎన్నికల ఖర్చుల పరిశీలకులు హన్మంతరెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్, ఆర్డీవో రాములు, చెన్నూరు ప్రత్యేక సబ్ కలెక్టర్ సిడాం దత్తులతో కలిసి రాజకీయ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ అభ్యర్థులు ప్రచారం కోసం వినియోగించే వాహనాలు, బ్యానర్లు, మైకులు, పోస్టర్లు, ప్రకటనలు, జెండాలు, భోజ నం, తాగునీరు ఇతర ప్రతి అంశానికి సంబం ధించి ధరను నిర్ణయించి ముసాయిదా పట్టికను తయారు చేశామని, ఏమైనా అభ్యంతరాలుంటే తెలియజేయాలన్నారు. ఎన్నికల సంఘం నిర్ణయానికి లోబడి ఖర్చులు చేయాలన్నారు.

మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ సదయ్య

బెల్లంపల్లి, జనవరి 5: మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని ఏసీపీ సదయ్య సూచించారు. శుక్రవారం పద్మశాలి భవన్‌లో మాదక ద్రవ్యాల నిర్మూలనపై యువకులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల యువత గంజాయి, తదితర మత్తు పదార్థాలకు బానిసవుతున్నారన్నారు. మాదక ద్రవ్యాల ద్వారా అనారోగ్యం పాలై జీవితం అంధకారమవుతుందని పేర్కొన్నారు. యువత చదువుతోపాటు క్రీడలపై మక్కువ పెంచుకోవాలని, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, క్రమ శిక్షణతో చదువుకోవాలని సూచించారు. రూరల్ సీఐ రాజశేఖర్‌గౌడ్, సబ్ డివిజన్‌లోని ఎస్ఐలు,యువకులు పాల్గొన్నారు.

శేజల్‌పై పెట్టిన అట్రాసిటీ కేసు ఉపసంహరించుకోవాలి

- కోల్‌బెల్ట్ కమిటీ కార్యదర్శి ప్రభాత్

మంచిర్యాల, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ద్వారా బాధింపబడి, అవమానాలు ఎదుర్కొన్న శేజల్‌పై అక్రమంగా పెట్టిన ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసును ఉపసంహరించుకోవాలని మావోయిస్టు పార్టీ కోల్‌బెల్ట్ కమిటీ కార్యదర్శి ప్రభాత్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన శుక్రవారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. యేడాదిన్నర నుంచి శేజల్ బెల్లం పల్లి, హైదరాబాద్, ఢిల్లీ వరకు న్యాయపోరాటం చేసినా ఎవరూ పట్టించుకోలే దన్నారు. పోలీసు అధికారులు ఆమెపై కేసులు పెట్టారని, బెదిరింపులకు గురి చేశారని. బీఆర్ఎస్ గూండాలతో దాడులు చేయించారని ఆరోపించారు. ప్రస్తు తం అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు శేజల్‌పై జరిగిన లైంగిక వేధింపులపై విచారణ జరిపించి దుర్గం చిన్నయ్య, అతని అనుచరులపై చర్యలు తీసుకొని, బాధితురాలికి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారన్నారు. కానీ వారు కూడా ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటి పాలకులు, పోలీసులు వ్యవహరిస్తున్న తీరు గత బీఆర్ఎస్ ఎమ్మెల్యే హయాంలో జరిగిన మాదిరిగానే ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్ కలుగజేసుకొని శేజల్‌కు న్యాయం చేయాలని కోరారు. పాలకులు, పోలీసులు, గూండాలు ప్రజలను వేధించినా, భయాందోళలనకు గురిచేసినా ప్రజల చేతిలో భంగపడక తప్పదని ప్రభాత్ హెచ్చరించారు.

అయోధ్య శ్రీరాముడి అక్షింతల పంపిణీ

ఆసిఫాబాద్ రూరల్, జనవరి 5: జిల్లా కేంద్రంలోని బ్రాహ్మణవాడ శ్రీకేశవనాథస్వామి ఆలయంలో శుక్రవారం భక్తులకు అయోధ్య శ్రీరాముడి అక్షింతలు, చిత్రపటాలను అందజేశారు. అక్షింత లను ఈ నెల15వరకు ఇంటింటికి అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సందీప్‌నగర్‌కాలనీతో పాటు పలు కాలనీల్లో ఇంటింటికి తిరుగుతూ అక్షింతలు అంద జేశారు. నరేష్‌శర్మ, మనోజ్‌కుమార్, అభయ్‌కుమార్, విశాల్, విజయ్ కుమార్, ప్రదీప్ పాల్గొన్నారు.

బెజ్జూరు: ఎల్కపల్లి గ్రామంలో శ్రీరామ అక్షింతలతో శోభాయాత్ర నిర్వహించారు. మండల కేంద్రంలోని రంగనాయక, శివాలయం, హనుమాన్, వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయాల నుంచి అక్షింతలను తీసుకువచ్చి ఇంటింటికి పంపిణీ చేశారు. వెంకటేష్, నీలేష్, రామకృష్ణ, శ్రీనివాస్, మోహన్, అంజయ్య, పాల్గొన్నారు.

పెంచికలపేట: ఎల్లూరు ప్రసన్నాంజనేయ ఆలయంలో అక్షింతలకు పూజలు నిర్వహించి ఇంటింటికి పంపిణీ చేశారు. గురువయ్య, లక్ష్మీనారాయణగౌడ్, శంకర్ గౌడ్, హన్మగౌడ్, పాల్గొన్నారు.

దండేపల్లి: శ్రీరామ మందిర అక్షింతలను మ్యాదరిపేటలో హనుమాన్ భక్త బృందం ఆధ్వర్యంలో శోభాయాత్ర చేపట్టారు. గ్రామంలో ఇంటింటికి అక్షింతలను పంపిణీ చేశారు.

నెన్నెల: అయోధ్య రాముని పూజిత అక్షింతలు గొళ్లపల్లికి చేరగా శోభా యాత్ర నిర్వహించారు. మాజీ పీఏసీఎస్ ఛైర్మన్ ఇందూరి రమేష్, మాజీ సర్పంచ్ తిరుపతిగౌడ్ శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

బెల్లంపల్లి: ఇంటింటికి అయోధ్య రామ జన్మభూమి తీర్థ ట్రస్టు ఆధ్వ ర్యంలో పట్టణంలోని 1వ వార్డులో కౌన్సిలర్ సంగీత, ట్రస్టు సభ్యులు జాగాటి కల్పన ఆధ్వర్యంలో అక్షింతలు పంపిణీ చేశారు.

మందమర్రిటౌన్: పట్టణంలో శ్రీరాముని అక్షింతల శోభాయాత్రను ఘనంగా నిర్వహించారు. కోల్‌బెల్ట్ రోడ్డు మీదుగా మార్కెట్‌సెంటర్ వరకు కొనసాగింది. శ్రీరామజన్మభూమితీర్థ ట్రస్టుఆధ్వర్యంలో అక్షింతలను ప్రజలకు పంపిణీ చేశారు.

రామకృష్ణాపూర్: అయోధ్య రాముడి అక్షింతలను రామకృష్ణాపూర్‌లో ఊరేగించారు. అంబాప్రసాద్, వేముల హరి ప్రసాద్, కొమురయ్య, సతీష్ హరి, బూర్ల పవన్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

తాండూర్: తాండూర్, కొత్తపల్లి గ్రామాల్లో అయోధ్య రాముని అక్షింతలను ఇంటింటికి పంపిణీ చేశారు. మార్కండేయ శివాలయం, కొత్తపల్లిలోని అభయాంజనేయస్వామి దేవాలయంలో అక్షింత లకు ప్రత్యేక పూజలు నిర్వహించి పంపిణీ చేశారు.

వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

జైపూర్, జనవరి 5: విద్యలో వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని డీఈవో యాదయ్య పేర్కొన్నారు. శుక్రవారం కేజీబీవీ పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. పదో తరగతి విద్యార్థులు శ్రద్ధగా చదువుకుని పాఠశాలకు తల్లిదండ్రులకు, మంచి గుర్తింపును తీసుకురావాలని సూచించారు. మెనూ ప్రకారం భోజనం అందించాలని ఎస్‌వో ఫణిబాలకు సూచించారు. ప్రత్యేక తరగతులు తీసుకుంటున్నారా అని అడిగి తెలుసుకున్నారు.

జిల్లా ఇన్‌చార్జి డీసీఎస్‌వోగా వాజిద్

మంచిర్యాల కలెక్టరేట్, జనవరి 5 : జిల్లా ఇన్‌చార్జి డీసీఎస్‌వోగా వాజిద్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం అదనపు కలెక్టర్ మోతిలాల్‌ను మర్యాద పూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపి పూలమొక్కను అందజేశారు. ఇంతకుముందు డీసీఎస్‌వోగా పనిచేసిన ప్రేంకుమార్ పెద్దపల్లి జిల్లాకు బదిలీపై వెళ్లారు. వాజిద్‌కు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

అక్రమ మైనింగ్‌పై సింగరేణి అధికారులకు హైకోర్టు నోటీసులు

జైపూర్, జనవరి 5: శ్రీరాంపూర్ ఓసీపీ టూ ప్రాజెక్టులో పర్యావరణ అనుమతులకు విరుద్ధంగా అక్రమంగా బొగ్గు తవ్వకాలు నిర్వహిస్తున్నారని రామారావుపేట సర్పంచు నామాల సత్యవతి తిరుపతి తోపాటు గ్రామానికి చెందిన ఆరుగురు హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు పరిశీలన అనంతరం ఎన్విరాన్‌మెంట్ నిజామాబాద్, డైరెక్టర్ జనరల్ మైనింగ్ సేఫ్టీ హైదరాబాద్, సీఎండీ సింగరేణి కొత్తగూడెం, కలెక్టర్ మంచిర్యాల, శ్రీరాంపూర్ జనరల్ మేనేజర్‌కు నోటీసులు ఇచ్చినట్లు సర్పంచు శుక్రవారం పేర్కొన్నారు.

కేంద్ర పథకాలపై అవగాహన

బెజ్జూరు, జనవరి 5: మండలంలోని చిన్నసిద్దాపూర్, పెద్ద సిద్దాపూర్ గ్రామాల్లో శుక్రవారం వికసితభారత్ సంకల్పయాత్రలో భాగంగా కేంద్రప్రభుత్వపథకాలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా సెంట్రల్‌ఫైనాన్స్ లిటరేచర్‌రాజబాబు మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పథకాలను ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో టీజీబీ మేనేజర్ పృథ్వీతేజ, ఏపీఎం భద్రయ్యపాల్గొన్నారు.

గ్రూప్ ఫౌండేషన్ కోర్సు ఉచిత శిక్షణ

మంచిర్యాల కలెక్టరేట్, జనవరి 5: ఉమ్మడిఆదిలాబాద్ జిల్లాలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ డిగ్రీ ఉత్తీర్ణులైన అభ్యర్థులు గ్రూప్ 1,2,3,4 ఫౌండేషన్ కోర్సుల్లో ఉచిత శిక్షణ కోసం దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా వెనకబడిన తరగతుల అభివృద్ధి అధికారి వినోద్‌కుమార్, ఆదిలాబాద్ బీసీస్టడీసర్కిల్ డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్ శుక్రవారం ఒకప్రకటనలో తెలిపారు. ఈనెల20వ తేదీలోగా ఆన్‌లైన్‌లో నమోదుచేసుకోవాలని, వివరాలకోసం 08732-221280 లో సంప్రదించాలన్నారు.

పీఆర్టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ

వాంకిడి, జనవరి 5: మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం పీఆర్టీయూటీఎస్ నూతనసంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు



శ్రీనివాస్ (ఫైల్)

తాండూర్, జనవరి 5: తాండూర్ మండలంలోని కిష్టంపేట గ్రామానికి చెందిన గోమాస శ్రీనివాస్ అదృశ్యంపై పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైనట్లు ఎస్ఐ రాజశేఖర్ శుక్రవారం తెలిపారు. గోమాస శ్రీనివాస్ డిసెంబరు 7న వారణాసి తీర్థ యాత్రకు వెళ్లి వస్తానని కుటుంబీకులకు చెప్పి ఇంటి నుం చి వెళ్లి ఇప్పటి వరకు రాలేదని తెలిపారు. దీంతో శ్రీనివాస్ సోదరుడు జగదీష్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఒకే ఈతలో రెండు లేగ దూడలు



నెన్నెల, జనవరి 5: నెన్నెల మండలం ఆవడంలో బేతు మహేష్‌కు చెం దిన ఆవు ఒకే ఈతలో రెండు లేగ దూడలకు జన్మనిచ్చింది. శుక్రవారం పశు వైద్య సిబ్బంది సాయంతో రెండు మగ దూడలను ఈనింది. రెండు లేగదూడలు పుట్టడం అరుదుగా జరుగుతుందని వెటర్నరీ వైద్యులు దిలీప్ తెలిపారు.

బీఆర్ఎస్ సీనియర్ నేత గుండెపోటుతో మృతి



తోకల సురేష్ (ఫైల్)

జన్నారం, జనవరి 5 : మండల బీఆర్ఎస్ సీనియర్ నేత తోకల సురేష్ (60) శుక్రవారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు. టీడీపీ, బీఆర్ఎస్ పార్టీల్లో చురుకైన నేతగా పనిచేశారు. ఖానాపూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్ నాయక్ తోకల సురేష్ మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేశారు. కుటుంబీకులను ఓదార్చారు. బీఆర్ఎస్ నాయకులు ఫజల్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.


గంజాయి పట్టివేత



ఏసీసీ, జనవరి 5: మంచిర్యాల రైల్వేస్టేషన్‌లో గురువారం రాత్రి గంజాయి పట్టుకున్నట్లు ఎస్ఐ జగదీష్ తెలిపారు. పట్టణంలోని ఎన్‌టీఆర్ నగర్‌కు చెందిన పత్తం అభిరామ్ మహారాష్ట్రలోని చంద్రపూర్ నుంచి రైలులో గంజాయి అక్రమంగా తీసుకు వస్తున్నట్లు అందిన సమాచారం మేరకు రైల్వేస్టేషన్‌లో మాటు వేసి పట్టుకున్నామన్నారు. తనిఖీ చేయగా 68 గ్రాముల గంజాయి లభించిందన్నారు. గంజాయిని స్వాధీనం చేసుకుని నిందితునిపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రక్త పరీక్షల శిబిరం

జన్నారం, జనవరి 5: జన్నారం, కిష్టాపూర్ గ్రామాల్లో శుక్రవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో 225 మందికి షుగర్, రక్త పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. సభ్యులు అనుముల రాజన్న, రాజేందర్‌లు మాట్లాడుతూ ఉచితంగా షుగర్, రక్త పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. అంజుతరావు, మల్లేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.



కౌలు రైతుకు సాయం అందేనా?

- రూ.15వేలు చెల్లిస్తామన్న కాంగ్రెస్
- విధివిధానాలపై ప్రభుత్వం కసరత్తు
- యేటేటా పెరుగుతున్న కౌలు రేట్లు
- కౌలు చట్టాలు అమలైతే 3వేల మందికి మేలు



మంచిర్యాల, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం రెక్కలు ముక్కలు చేసుకొని పంటలు పండించే కౌలు రైతులను ఆదుకుంటామని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో హామీ ఇచ్చింది. వారికి యేటా రూ.15 వేలు చెల్లిస్తామని పేర్కొంది. వారికి ఇచ్చిన హామీని నెరవేర్చేందుకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది.

భూములు లేని పేద రైతులకు ఇన్నాళ్ల ప్రభుత్వాలు పట్టించుకోలేదు. ఇప్పుడు వారిని ఆదుకునేందుకు మార్గం సుగమం అవుతోంది. చీడపీడల కారణంగా పంటలు దెబ్బతిన్నా, చేతికొచ్చే సమయంలో అకాల వర్షాలు, ఇతరత్రా ప్రకృతి విపత్తులతో నష్టపోయినా ముందుగా కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం భూ యజమానికి కౌలు చెల్లించాల్సిందే. కాంగ్రెస్ హామీ అమలైతే కౌలు రైతులకు మంచి రోజులు వచ్చే అవకాశాలు ఉన్నాయి.

యేటా పెరుగుతున్న కౌలు రేట్లు

కౌలు రేట్లు యేటా పెరుగుతుండటంతో రైతులపై అధిక భారం పడుతోంది. ప్రస్తుతం నీటి వసతులు ఉన్నచోట ఎకరా భూమికి సంవత్సరానికి రూ.15వేల పైచిలుకు పలుకుతోంది. నీటి వసతులు తక్కువగా ఉన్నచోట రూ.10వేల నుంచి 12వేల వరకు యజమానులు వసూలు చేస్తున్నారు. పదేళ్లలో కౌలు రేట్లను పరిశీలిస్తే దాదాపు మూడు రెట్లు పెరిగాయి. 2010లో ఎకరాకు రూ.3 వేలు ఉన్న కౌలు భూముల ధరలు, 2022లో రూ.15వేలు ఉండగా 2023లోనూ అదే మాదిరిగా కౌలు రేట్లు వసూలు చేశారు. పంటతో సంబంధం లేకుండా అగ్రిమెంటు ప్రకారం భూముల యజమానులకు కౌలు రైతులు పై రేట్లు చెల్లించాల్సి వస్తోంది.

చట్టాలు చచ్చుబండలు

కౌలు రైతులకు ప్రభుత్వపరంగా సహాయ సహకారాలు అందించేందుకు ఉమ్మడి రాష్ట్రంలో ఆంధ్రప్రదేశ్ ల్యాండ్ లైసెన్స్‌డ్ కల్టివేటర్స్ రూల్స్-2012 చట్టం అమల్లో ఉండేది. అయితే బీఆర్‌ఎస్ ప్రభుత్వం రావడంతో చట్టం కనుమరుగైంది.

2016-17 వరకు చట్టాన్ని అమలు చేసిన ప్రభుత్వం అనంతరం పట్టించుకోవడంలేదు. చట్టంలో భాగంగా రెవెన్యూ అధికారులు కౌలు రైతులకు గుర్తింపు కార్డులు అందజేసేవారు. గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద రైతుల వివరాలు నమోదు చేసే వారు. కౌలు రైతులకు రుణ అర్హత కార్డులు అందేవి. క్రాపు లోన్ మినహాయించి ఇతరత్రా రుణాలు పొందేందుకు ఉపయోగపడేవి. బీఆర్‌ఎస్ ప్రభుత్వం కౌలు రైతుల గుర్తింపును రద్దు చేయడంతో ప్రభుత్వపరంగా వీరికి ఎలాంటి సహాయ సహకారాలు అందడంలేదు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రుణమాఫీ ప్రకటించి, రైతుబంధు కింద ఎకరానికి యేటా రూ.8వేలు అందించినా భూ యజమానికే తప్ప కౌలు రైతులకు ఎలాంటి ప్రయోజనం కలగలేదు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి, తమనూ రైతుబంధు పథకం పరిధిలోకి తెచ్చి, పెట్టుబడి సాయం అందజేయాలని కౌలు రైతులు విజ్ఞప్తి చేసినా అప్పటి ప్రభుత్వం పట్టించుకోలేదు.

ఆత్మహత్యలే శరణ్యమని

అధికారుల లెక్కల ప్రకారం జిల్లాలో సుమారు 3వేల మంది కౌలు రైతులు ఉన్నారు. పంట దిగుబడిరాక, అప్పులు తీర్చే మార్గం కానరాక ఆత్మహత్యలకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. కోటపల్లి మండలం పుల్లగామకు చెందిన కౌలు రైతు కామ లింగయ్య (51) పత్తి పంట ప్రాణహిత వరదల్లో మునిగి నష్టం వాటిల్లగా 2022 సెప్టెంబరు 20న ఆత్మహత్య చేసుకొన్నాడు.

భీమారం మండలం కొత్తపల్లికి చెందిన దుర్గం శ్రీనివాస్ (27) నాలుగెకరాలను కౌలుకు తీసుకొని పత్తి సాగు చేయగా అధిక వర్షాల కారణంగా దిగుబడి రాక అక్టోబర్ 27న ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తాండూరు మండలం రేపల్లె వాడకు చెందిన పెద్దపల్లి లక్ష్మి (41) అనే కౌలు రైతు భార్య పంట దిగుబడి తగ్గి నవంబరు 16న పురుగుల మందు తాగగా 18న మృతి చెందింది. అదే నెల 29న కాసిపేట మండలం కొండాపూర్ చెందిన కొమిరె కనకయ్య (39) పంట దిగుబడి రాక బలవంతపు మరణానికి పాల్పడ్డాడు. లక్షెట్టిపేట మండలం చందారంలో పంట దిగుబడి రాక డిసెంబరు 11న పురుగుల మందు తాగి ఆకుల మల్లయ్య (45) అనే కౌలు రైతు ఆత్మహత్య చేసుకోగా, కన్నెపల్లి మండలం జనకాపూర్ చెందిన కౌలు రైతు మేడి శ్రీనివాస్ (40) అదే నెల 12న తనువు చాలించాడు.

పంటలు పండించేందుకు కౌలు రైతులు పెట్టే పెట్టుబడులు సైతం అధికంగానే ఉంటున్నాయి. సరాసరి ఎకరా విస్తీర్ణం సాగు కోసం దున్నేందుకు ట్రాక్టర్ కిరాయి రూ.6 వేలు వెచ్చించాల్సి వస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. అలాగే నాటు వేయడానికి రూ.4 వేలు, ఎరువుల కోసం రూ.8 వేలు, కలుపు తొలగించేందుకు రూ.3 వేలు, పంట సమయంలో కోత మెషీన్‌కు గంటన్నరకు రూ.3000 చెల్లిస్తున్నారు. ఈ లెక్కన ఎకరా సాగు చేసేందుకు రైతులు సరాసరి రూ.21 వేలకుపైగా ఖర్చు చేస్తున్నట్లు తెలుస్తోంది. పెట్టుబడులు యేటా పెరుగుతుండటంతో కౌలు రైతు అధిక భారం మోయక తప్పడం

● పెట్టుబడులూ అధికమే

లేదు. గతేడాది రూ.6 వేలు ఉన్న ట్రాక్టర్ కిరాయి ఈయేడు వెయ్యి రూపాయల వరకు పెరిగింది. ఎరువుల ధరలు సరాసరి రూ. 2వేల వరకు పెరిగినట్లు రైతులు వాపోతున్నారు. 2017 వరకు జిల్లాలో 300 మంది కౌలు రైతులు ఉండగా 172 మందికి ప్రభుత్వపరంగా గుర్తింపు కార్డులు అందజేశారు. రూ.3 లక్షల వరకు రుణం మంజూరు చేశారు. అనంతరం కౌలు రైతు గుర్తింపు కార్డులను ప్రభుత్వం రద్దు చేయగా బ్యాంకులు రుణాలు నిలిపి వేశాయి. పంట పెట్టుబడుల కోసం ప్రైవేటు వడ్డీ వ్యాపారులను ఆశ్రయించి నిలువు దోపిడీకి గురవుతున్నారు.

గూడెం ఆలయ హుండీల లెక్కింపు



లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది, అధికారులు

దండేపల్లి, జనవరి 5: గూడెం సత్యనారాయణ స్వామి దేవస్థానంలో 37 రోజులకుగాను హుండీలు లెక్కించగా రూ.6,28,066 ఆదాయం సమకూరినట్లు ఈవో సంకటాల శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం ప్రధానాలయంలో హుండీని దేవాదాయ ధర్మదాయ శాఖ సహాయ కమిషనర్ ఎన్.నవీన్, అర్చకులు గోవర్ధన రఘస్వామి సమక్షంలో లెక్కించారు. వివిధ రసీదులు, టిక్కెట్ల ద్వారా, భక్తులు వేసిన కానుకలతో కలిపి రూ.6,28,066 వచ్చిందన్నారు. రెనోవేషన్ సభ్యులు వేముల రాజగురువయ్య, నస్పూర్ దీప్‌చందు, సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

సైబర్ మోసగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలి



గంగారంలో అవగాహన కల్పిస్తున్న ఎస్సై శ్రీనివాస్

నెన్నెల, జనవరి 5: సైబర్ మోసగాళ్ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఇన్‌చార్జి ఎస్సై శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం గంగారంలో ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండి జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఫోన్లు చేసి బహుమతులు వచ్చాయని, లాటరీ తగిలిందని, లోన్లు ఇస్తామని ఆశ చూపుతారని అన్నారు. వ్యక్తిగత బ్యాంకింగ్ వివరాలు, ఓటీపీలు అపరిచిత వ్యక్తులకు చెప్పకూడదని సూచించారు. ఫోన్లలో వచ్చే అనవసర లింకులను ఓపెన్ చేస్తే ఖాతాలు ఖాళీ అవుతాయన్నారు. సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోతే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. సర్పంచ్ కామెర సుధాశ్రీనివాస్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలకు సౌండ్ సిస్టం అందజేత



పాఠశాలకు సౌండ్ సిస్టం అందిస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

కోటపల్లి, జనవరి 5: పారుపెల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు శుక్రవారం మంచిర్యాల లయన్స్‌క్లబ్ గర్మిళ్ల శాఖ సభ్యులు రూ. 25 వేల విలువ చేసే సౌండ్ సిస్టంను విరాళంగా అందించారు. లయన్స్‌క్లబ్ ప్రెసిడెంట్ ఎం.వెంకటేశ్వర్ మాట్లాడుతూ క్లబ్‌చే నిర్వహించే పలు సామాజిక కార్యక్రమాల్లో భాగంగా సౌండ్ సిస్టం అందించినట్లు పేర్కొన్నారు. ప్రధానోపాధ్యాయుడు యోగేశ్వర్, క్లబ్ జోనల్ చైర్మన్ రాంచందర్, జిల్లా చైర్మన్ రమేష్‌బాబు, పూరెళ్ల సతీష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు మందమర్రిలో ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ముగ్గుల పోటీలు

● సింగరేణి మహిళా జూనియర్, డిగ్రీ, పీజీ కళాశాల వేదిక ● ఉదయం 10 గంటలకు పోటీలు ప్రారంభం



ముగ్గుల పోటీలకు చేస్తున్న ఏర్పాట్లు

మందమర్రి టౌన్, జనవరి 5: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా యేటా ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ముత్యాల ముగ్గుల పోటీలు శనివారం మందమర్రి పట్టణంలోని సింగరేణి మహిళా జూనియర్, డిగ్రీ, పీజీ కళాశాలలో జరగనున్నాయి. 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు... పవర్డ్ బై ఎయిమ్స్ విద్యాసంస్థలు, బెంగళూరు... రియల్ పార్టనర్ స్వర్గసీమ సుకేతన" ఆధ్వర్యంలో పోటీలు జరుగనున్నాయి. మంచిర్యాల బెల్లంపల్లి చౌరస్తాలోని స్వరూప ఆసుపత్రి నిర్వాహకులు బహుమతులు స్పాన్సర్ చేస్తున్నారు. ముగ్గుల పోటీల్లో పాల్గొనే మహిళలు శని వారం ఉదయం 10 గంటల కంటే ముందు సింగరేణి మహిళా జూనియర్ డిగ్రీ, పీజీ కళాశాలకు చేరుకో వాల్సి ఉంటుంది. ప్రథమ బహుమతి రూ.6 వేలు, ద్వితీయ బహుమతి రూ.4 వేలు, తృతీయ బహుమతి రూ.3 వేలు అందజేయనున్నారు. శుక్రవారం ముగ్గుల పోటీల ఏర్పాట్లను స్వరూపారాణి ఆసుపత్రి నిర్వాహకులు డా.జానపాటి శరత్‌బాబు, కళాశాల నిర్వాహకులు హీరాలాల్ ఉపాధ్యాయ పరిశీలించారు.

పోటీల నిబంధనలు ఇవీ

- మహిళలు మాత్రమే పాల్గొనాలి.
- చుక్కల ముగ్గులు మాత్రమే వేయాలి. చేతితో మాత్రమే వేయాలి పరికరాలు ఉపయోగిస్తే మార్కులు కట్ చేస్తారు. జల్లెడ మాత్రం అనుమతిస్తారు.
- ముగ్గులు, ముగ్గుకు కావలసిన రంగులు, ఇతర సామగ్రి పోటీలో పాల్గొనే వారే తెచ్చుకోవాలి.
- ముగ్గులో ఎన్ని చుక్కలు, ఎన్ని వరుసలు చెప్పగలిగి ఉండాలి
- ముగ్గు వేయడానికి రెండు గంటల సమయం.
- ముగ్గులలో గొబ్బెమ్మలు, బతుకమ్మ వంటివి అమర్చవచ్చు. ఇతర వస్తువులు ఎక్కువగా అమర్చకూడదు.
- ముగ్గుకు అదనపు అందం ఇవ్వడానికి వస్తువులను వాడాలి తప్ప అవే ప్రధానఅంశాలు కాకూడదు.

క్రికెట్ పోటీలకు మైదానం ముస్తాబు

మందమర్రిరూరల్, జనవరి 5: సారంగపల్లి గ్రామంలో త్వరలో జరిగే క్రికెట్ టోర్నమెంట్ కోసం క్రీడా మైదానాన్ని సర్పంచు పర్వీనాసుల్తానాఫిరోజ్ శుక్రవారం చదును చేయించారు. మైదానంలోని పిచ్చి మొక్కలను తొలగించారు. సర్పంచు మాట్లాడుతూ త్వరలో గ్రామీణ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈకార్యక్రమంలో స్థానికులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వెంకటయ్య

బెల్లంపల్లి, జనవరి 5: పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో శుక్రవారం పదో తరగతి విద్యార్థులకు సైకాలజిస్టు, మోటివేషనల్ స్పీకర్, రాంటెంకి వెంకటయ్య అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఒక్కరి జీవితంలో పదో తరగతి అత్యంత విలువైందన్నారు. సమయాన్ని వృథా చేయకుండ కష్టపడి చదివి మంచి మార్కులు సాధించాలన్నారు. లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకుని ముందుకు సాగాలన్నారు. అనంతరం పదో తరగతి తర్వాత ఉండే కోర్సులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ రవి ప్రసాద్,ప్రిన్సిపాల్ రాజరమేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ రుణాలు అందించాలి

కోటపల్లి, జనవరి 5: మండలంలోని షెడ్యూలు తెగల కార్పొరేషన్ ద్వారా అర్హులైన లబ్ధిదారులకు రుణ సహాయం అందించాలని కలెక్టర్ బదావత్ సంతోష్‌కు వినతిపత్రం అందించినట్లు ఎంపీపీ మంత్రి సురేఖ రామయ్య తెలిపారు. 2020-21 సంవత్సరానికిగాను 12 మంది, 2021-22 సంవత్సరానికి 32 మందికి రుణ సహాయం కోసం ఇంటర్వ్యూలు పూర్తయ్యాయని, ఇంత వరకు వీరికి రుణ సహాయం అందలేదన్నారు. ఆన్‌లైన్ ద్వారా రుణ సహాయం లబ్ధిదారులకు రుణాలు అందించి లబ్ధి చేకూర్చాలని కోరినట్లు తెలిపారు.

ఉత్తమ డాక్టర్‌గా కృష్ణమోహన్



అనిల్‌కపూర్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న కృష్ణమోహన్

చెన్నూరు, జనవరి 5: చెన్నూరు పట్టణానికి చెందిన కృష్ణమోహన్ ఉత్తమ డాక్టర్ అవార్డును అందుకున్నారు. 2023 సంవత్సరానికి గాను టైమ్స్ గ్రూప్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో యేటా ఇచ్చే ఉత్తమ డాక్టర్ అవార్డును ఇటీవల నిర్వహించిన కార్యక్రమంలో బాలీవుడ్ నటుడు అనిల్‌కపూర్ చేతుల మీదుగా కృష్ణమోహన్ అందుకున్నారు. కృష్ణమోహన్‌ను స్నేహితులు, పట్టణ పుర ప్రముఖులు అభినందించారు.

8న శ్రీరాంపూర్ ఐటీఐలో అప్రెంటిస్‌షిప్ మేళా

శ్రీరాంపూర్, జనవరి 5 : శ్రీరాంపూర్ ఐటీఐలో ఈ నెల 8న అప్రెంటిస్‌షిప్ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ఎం. చందర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రముఖ కంపెనీలలో అప్రెంటిస్‌షిప్ చేసేందుకు అవకాశం ఉందని, ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, డీజిల్ మెకానిక్, కోపా, ఎలక్ట్రానిక్స్ మెకానిక్ ట్రేడ్స్‌లలో 2023 నాటికి పాసైన విద్యార్థులు అర్హులని తెలిపారు. సంబంధిత విద్యార్థులు www.apprenticeshipindia.gov.in అనే వెబ్‌సైట్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని, రిజిస్ట్రేషన్ ఫారంతో పాటు ఎస్ఎస్‌సి మెమో, ఐటిఐ సర్టిఫికెట్లు జిరాక్స్ కాపీలతో మేళాకు హాజరు కావాలని కోరారు.